

# రైతుల అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి!

- రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం
- గ్రామ స్థాయిలో పథకాలపై అవగాహన కల్పించాలి
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేటలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నూతనంగా నియమితులైన ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణతో పాటు కమిటీ డైరెక్టర్లను సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో ఆత్మ కమిటీ కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల ప్రోత్సాహక పథకాలు, సబ్సిడీలు, వ్యవసాయ యంత్రాల పంపిణీ, సాగునీటి సౌకర్యాలు, రైతు రుణాలపై అవగాహన కార్యక్రమాలను గ్రామ స్థాయిలో తీసుకెళ్లాలని కోరారు.

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా, మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపడేలా, ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు ప్రభుత్వం నుంచి తక్షణ సహాయం అందేలా ఆత్మ కమిటీ ప్రభుత్వానికి వారధిగా పని చేయాలని హరికృష్ణ సూచించారు. ప్రతి గ్రామంలో రైతుల సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. నూతన ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పూజల హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తామని, రైతు సమస్యల పరిష్కారానికి ముందుండి పని చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కమిటీ డైరెక్టర్లు పులగుర్ల రజిత, గణపురం సంతోషి, ఉమాదేవి, అఖిల, గూడెపు దేవలక్ష్మి, ఆబాకీ సంగీత, బత్తుల స్రవంతి, ముతకాని పోచవ్వ, రెడ్డి బాలయ్య, ఐరేని అంజిరెడ్డి, బొజ్జ రాజకుమార్, ఆడపు లక్ష్మీనారాయణ, మహమ్మద్ అజ్మత్ అలీ, రాకేష్ యాదవ్, బందెల కనకయ్య, మద్దూరి ఎల్లయ్య, ఎర్ర శ్రవణ్, నరాల బాబు, ఎర్రోళ్ల బాబు, రాచకొండ కనకయ్య, ఉడుత ప్రశాంత్, గూడెంపు శ్రీనివాస్, శివరాత్రి తిరుపతి, పీ. వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త మహిపాల్ రెడ్డి, ఎర్ర మహేందర్, టీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు చెంది శ్రీనివాస్ ముదిరాజ్, అశోక్, జనార్ధన్ రెడ్డి, అనిల్ కుమార్, బుచెల్లి రవికుమార్ తదితరులు హాజరయ్యారు.

# గ్రామ అభివృద్ధికి బాటలు!

**ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ**

**60 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన**

**లక్ష్మీపూర్‌లో సీసీ రోడ్డు ప్రారంభం, కిచెన్ షెడ్ పనులకు భూమి పూజ**



**బెజ్జంకి, మే 11 (జనం పవర్):** బెజ్జంకి మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ. 60 లక్షల వ్యయంతో చేపట్టిన నూతన తరగతి గదుల నిర్మాణ పనులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం భూమి పూజ చేశారు. అనంతరం లక్ష్మీపూర్ గ్రామంలో రూ. 25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అలాగే రూ. 6 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న పాఠశాల కిచెన్ షెడ్ నిర్మాణ పనులకు కూడా ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తోడ్పడే ఈ పనులతో స్థానికులకు మెరుగైన వసతులు అందుతాయన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో ప్రధాన భూమిక పోషిస్తున్న రహదారులు, ముఖ్యంగా సీసీ రోడ్ల నిర్మాణాలు విరివిగా చేపడుతున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత, ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, బెజ్జంకి, లక్ష్మీపూర్ గ్రామాల పార్టీ అధ్యక్షులు బి రాజు, ఆర్ రామకృష్ణ, పార్టీ నాయకులు బైర సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళల రక్షణే పోలీసుల లక్ష్యం!

**ఎస్ఐ ఉషారాణి**

**రెబ్బెనపల్లిలో షీ టీమ్ అవగాహన సదస్సు**

**దండేపల్లి, మే 11 (జనం పవర్):** దండేపల్లి మండలంలోని రెబ్బెనపల్లి గ్రామంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సిబ్బంది మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలను వివరించారు. ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, టీ-సేఫ్ యాప్, షీ టీమ్స్ సేవలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.

అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలో కూలీలకు వివరిస్తూ.. అత్యవసర సహాయం కోసం డయల్ 100, రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల జిల్లా షీ టీమ్ నంబర్ 8712659385 సంప్రదించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రతకు పెద్దపీట వేస్తోందని, వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది, కానిస్టేబుళ్లు సతీష్, జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నయ్య, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# ప్రాణం తీస్తున్న అజాగ్రత్త!

## రోడ్డు భద్రతపై ఎస్సై మధుసూదన్ రెడ్డి అవగాహన

**నిబంధనలు మీరితే కేసులు, జరిమానాలు తప్పవు**

**యువత వేగం తగ్గించాలని పోలీసుల సూచన**

**సంగారెడ్డి, మే 11 (జనం పవర్):** జిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సంగారెడ్డి రూరల్ ఎస్సై మధుసూదన్ రెడ్డి సూచించారు. సంగారెడ్డి పరిధిలో రహదారులపై భద్రతా చర్యలను కఠినంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు వంటి నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవడం తప్పనిసరి అని చెప్పారు. ముఖ్యంగా యువత అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇది కుటుంబాలకు తీరని నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు.

మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ ఉపయోగించడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్స్‌ను పట్టించుకోకపోవడం వంటి నిర్లక్ష్యపు చర్యలే ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా గుర్తించామని తెలిపారు. రాత్రి వేళల్లో వాహనాలు నడిపేటప్పుడు హెడ్ లైట్లు సరిగ్గా ఉపయోగించడం, ఓవర్‌టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించడం అత్యంత అవసరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఆటోలు, లోడింగ్ వాహనాలు అధికంగా ప్రయాణిస్తున్న నేపథ్యంలో డ్రైవర్లు రహదారిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పాదచారులు కూడా జీబ్రా క్రాసింగ్‌లను ఉపయోగించి రహదారి దాటాలని, చిన్నారులు, వృద్ధుల భద్రతపై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించిన వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను తగ్గించగలమని, భద్రతే ప్రథమం అనే భావన ప్రతి ఒక్కరిలో పెంపొందాలని తెలిపారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు పోలీసులకు సహకరించి సురక్షితమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎస్సై మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు.



# బడి బాగు కోసం విద్యా సదస్సు!

**99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా వారోత్సవాలు**

**నిజాంసాగర్ నవోదయలో నియోజకవర్గ స్థాయి శిక్షణ**

**ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఎంఈఓ పిలుపు**

**జుక్కల్, మే 11 (జనం పవర్):** పాఠశాల విద్య – ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 నుంచి 17 వరకు విద్యా వారోత్సవాలు నిర్వహించడం జరుగుతోంది. బిచ్కుంద మండల సర్పంచులకు, మున్సిపల్ కౌన్సిలర్లకు విద్యాశాఖ ఆహ్వానం పలికింది. దీనిలో భాగంగా పాఠశాలల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో సర్పంచులు, పురపాలక సభ్యులకు అవగాహన కల్పించడానికి ఈ నెల 13న నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. నిజాం సాగర్ లోని నవోదయ పాఠశాలలో బుధవారం ఉదయం 9 గంటలకు ఈ సదస్సు ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి బిచ్కుంద మండల సర్పంచులు, కౌన్సిలర్లు అందరూ తప్పక హాజరు కావాలని బిచ్కుంద మండల విద్యాధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బడుల బలోపేతానికి ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

# జ్ఞాన దీప్తి.. విద్యా వారోత్సవం!

**99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా అట్టహాసంగా ప్రారంభం**

**బిచ్కుంద డిగ్రీ కళాశాలలో కరపత్రాల ఆవిష్కరణ**

**17వ తేదీ వరకు వైవిధ్యమైన కార్యక్రమాలు**




**బిచ్కుంద, మే 11 (జనం పవర్):** బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (స్వయం ప్రతిపత్తి) రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపల్ కే. అశోక్ ఘనంగా ప్రారంభించారు. ఇవి మే 11 నుంచి 17వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగుతాయని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాల కరపత్రాన్ని, గోడ పత్రికను కళాశాల సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. వారం రోజుల పాటు కళాశాలలో నిర్వహించబోయే కార్యాచరణను వివరిస్తూ.. ప్రతిరోజు ఒక ప్రత్యేక అంశంతో వివిధ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మొదటి రోజు నిర్వహించిన ఈ సదస్సులో కళాశాల ముందున్న భవిష్యత్తు లక్ష్యాలను అధ్యాపకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జీ. వెంకటేశం, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ జీ. రమేష్ బాబు, అకాడమిక్ సమన్వయకర్త డాక్టర్ టీ. హనుమాన్లు, పీజీ కోర్సుల సమన్వయకర్త టీ. సంతోష్, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి!

**నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీఏఎస్ నిధుల కోసం ఆందోళన**

**సర్టిఫికెట్లు ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరిక**

**కలెక్టరేట్ లో వినతిపత్రం అందజేసిన తల్లిదండ్రుల సంఘం**



**సంగారెడ్డి, మే 11 (జనం పవర్):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బీఏఎస్) పథకం ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం డిమాండ్ చేసింది. సుమారు ఐదు కోట్ల రూపాయల లోపు ఉన్న ఈ బకాయిల విడుదల కోసం సోమవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఎల్ వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్ చిత్తరి యాదగిరి మాట్లాడుతూ 2026-27 విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పెండింగ్ నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు వెంటనే సర్టిఫికెట్లు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఫీజుల చెల్లింపు ఆలస్యం కావడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించకపోతే విద్యార్థులను తరగతులకు అనుమతించబోమని, ఇంటికి పంపిస్తామని యాజమాన్యాలు హెచ్చరిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల పేద తల్లిదండ్రులు అప్పులు తెచ్చి ఫీజులు చెల్లించాలా లేక పిల్లలను చదువులకు దూరం చేయాలా అనే సందిగ్ధంలో ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు పాత బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని ఇబ్బందులకు గురిచేయడం సరికాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం 2025 అక్టోబర్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ద్వారా 25 శాతం నిధులు విడుదల చేసినప్పటికీ అవి ఏమాత్రం సరిపోవడం లేదని, మిగిలిన బకాయిలను పేద తల్లిదండ్రులు భరించలేని స్థితిలో ఉన్నారని వివరించారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని పూర్తి నిధులు విడుదల చేసి విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చూడాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా తల్లిదండ్రులను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మమత, వై బాలరాజ్, డి రాములు, కిరణ్ కుమార్, ప్రసాద్, కే జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# బిచ్కుందలో కాంగ్రెస్ జైత్రయాత్ర!

**మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక పూర్తి**

**ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు కృతజ్ఞతలు**

**మున్సిపాలిటీలో హస్తం పార్టీ ఏకపక్ష విజయం**



**జుక్కల్, మే 11 (జనం పవర్):** జుక్కల్ నియోజకవర్గ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు ఆధ్వర్యంలో బిచ్కుంద మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ తన పట్టును నిరూపించుకుంది. పన్నెండు మంది కౌన్సిలర్లకు గాను పది మందిని ఏకపక్షంగా గెలిపించుకున్న హస్తం పార్టీ ఇప్పుడు కోఆప్షన్ సభ్యుల ఎన్నికను కూడా విజయవంతంగా పూర్తి చేసింది. మున్సిపల్ చైర్‌పర్సన్ సీమ షెట్కర్, వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మితో పాటు పది మంది కౌన్సిలర్ల మెజార్టీ మద్దతుతో నలుగురు సభ్యులను కోఆప్షన్ పద్ధతిలో ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారిలో అసద్ అలీ, బొగుడమీద తానుబాయి, చింతల హనుమాన్లు, పర్వీన్ గఫార్ ఉన్నారు. ఈ సందర్భంగా తమ ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు నూతన సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగన్న, సాహిల్ షెట్కర్, బిచ్కుంద మాజీ ఉపసర్పంచ్ సాయిని అశోక్, బిచ్కుంద టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు బిచ్కుంద మండల ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు బొగుడమీద సాయిలు, ఖలీల్, ముజీబ్, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా పని చేస్తామని నాయకులు ఈ సందర్భంగా ప్రకటించారు.

# చిన్నారులకు జగ్గారెడ్డి సైకిళ్ల పంపిణీ!

**వేసవి సెలవుల్లో ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచన**

**ఇప్పటివరకు 320 మందికి అందజేత.. మరో 600 సిద్ధం**

**నియోజకవర్గ వ్యాప్తంగా విడతల వారీగా వితరణ**





**సంగారెడ్డి, మే 11 (జనం పవర్):** సంగారెడ్డి పట్టణంలోని 50 మంది చిన్నారులకు సోమవారం జగ్గారెడ్డి సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ వేసవి సెలవుల్లో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో సైకిళ్లు తొక్కవద్దని కోరారు. తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకున్న చిన్నారులకు విడతల వారీగా ఈ పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు 320 సైకిళ్ల పంపిణీ పూర్తికాగా.. మరో 600 సైకిళ్ల పంపిణీ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జార్జ్, చిద్రుప్ప రఘు గౌడ్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు, చిన్నారులకు అండగా ఉండటమే తమ లక్ష్యమని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. తమ కార్యాలయానికి వచ్చి పేరు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి సైకిల్ అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు.




# తపాలపూర్ చెక్ పోస్టులో లక్షల గోల్ మాల్!

**ప్రభుత్వ ఖజానాకు మూడు నెలలుగా సుమారు 6 లక్షల గండి**

**రిసీప్టుల సొమ్మునే జేబుల్లో వేసుకుంటున్న సిబ్బంది**

**ఉన్నతాధికారుల పర్యవేక్షణపై వెల్లువెత్తుతున్న విమర్శలు**




**తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

కవ్వాల్ టైగర్ జోన్ గుండెకాయ వంటి జన్నారం మండలంలోని తపాలపూర్ చెక్ పోస్ట్ ఇప్పుడు అవినీతికి అడ్డాగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారికంగా రిసీప్టులు ఇచ్చిన సొమ్మునే ప్రభుత్వానికి కట్టకుండా అధికారులు జేబులు నింపుకుంటున్నారనే వార్త స్థానికంగా కలకలం రేపుతోంది.

## ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

గత మూడు నెలలుగా ఈ చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ ద్వారా వసూలైన సుమారు 3 లక్షల నుంచి 6 లక్షల రూపాయల నగదును ప్రభుత్వ ఖాతాలో జమ చేయలేదని సమాచారం. డ్యూటీ ముగియగానే ట్రెజరీకి చేరాల్సిన ఈ నిధులను స్థానిక సిబ్బంది తమ సొంత అవసరాలకు మళ్లించుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ నిధులను వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకోవడంపై మండల ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు.

## వెలుగు చూడని వసూళ్లు ఇంకెన్నో?

ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన అవినీతి కేవలం రిసీప్టుల ద్వారా జరిగినది మాత్రమే. అయితే అసలు చర్చంతా ఇప్పుడు మరో కోణంలో సాగుతోంది. అధికారికంగా రికార్డుల్లో ఉన్న సొమ్మునే మూడు నెలలుగా నొక్కేసిన అధికారులు, ఇక రిసీప్టులు ఇవ్వకుండా వాహనదారుల నుంచి వసూలు చేసే డబ్బు ఇంకెంత ఉంటుందనే ప్రశ్న తలెత్తుతోంది. చెక్ పోస్ట్ వద్ద నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయని, రిసీప్టులు ఇవ్వకుండానే వేల రూపాయలు వసూలు చేస్తూ ఆ మొత్తాన్ని లెక్కల్లో చూపకుండా మింగేస్తున్నారనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి.




## పర్యవేక్షణలో అధికారుల వైఫల్యం

ఎఫ్ డీ ఓ, ఎఫ్ ఆర్ ఓ వంటి ఉన్నత స్థాయి అధికారులు విధుల్లో ఉండి ఏం చేస్తున్నారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మూడు నెలలుగా ఒక్క రూపాయి కూడా డిపాజిట్ కాకపోయినా అధికారులకు తెలియలేదా లేక తెలిసినా క్షేత్రస్థాయి సిబ్బందితో చేతులు కలిపి ఈ దోపిడీలో భాగస్వాములయ్యారా అనే ప్రశ్నలు ఇప్పుడు మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

## అక్రమార్కులను శిక్షించాలని డిమాండ్

అటవీ శాఖలో వేళ్లూనుకున్న ఈ అవినీతిపై జన్నారం మండలంలోని పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ సొమ్మును సొంతానికి వాడుకోవడం ముమ్మాటికీ నేరమని, వెంటనే తపాలపూర్ చెక్ పోస్ట్ రికార్డులను సీజ్ చేసి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమార్కులను కఠినంగా శిక్షించకుంటే పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న ఈ 'అటవీ దొంగల'పై ఉన్నతాధికారులు ఎలాంటి విచారణ చేపడతారో, అసలు నిందితులను ఎప్పుడు బయటపెడతారో వేచి చూడాల్సిందే.

# ఆధార్ కేంద్రంలో అక్రమ వసూళ్లు!

- నిబంధనలు బేఖాతరు.. ఇష్టారాజ్యంగా ఫీజుల వాత
- 75 రూపాయల పనికి 150 వసూలు చేస్తున్న నిర్వాహకులు
- అధికారుల పర్యవేక్షణ లోపంపై ప్రజల ఆగ్రహం




**తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో**

ప్రభుత్వ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాల్సిన ఆధార్ కేంద్రం జన్నారం మండలంలో అక్రమ వసూళ్లకు అడ్డాగా మారింది. నిబంధనలను తుంగలో తొక్కి సామాన్యుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్ నిర్వాహకుల తీరుపై అటు ప్రజలు, ఇటు స్థానిక నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం ప్రభుత్వం నిర్ణయించిన రుసుము 75 రూపాయలు మాత్రమే కాగా జన్నారం సెంటర్‌లో మాత్రం ఎటువంటి భయం లేకుండా 150 రూపాయలు వసూలు చేస్తున్నారు. ప్రశ్నించిన వారిపై నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. ఇది చట్టరిత్యా నేరమని, ఇలా అధిక వసూళ్లకు పాల్పడితే 3 నెలల జైలు శిక్షతో పాటు 50 వేల రూపాయల ఫైన్ విధించే అవకాశం ఉన్నప్పటికీ నిర్వాహకులు బరితెగించి వ్యవహరిస్తున్నారు.

## దరఖాస్తు ఫారాలపైనా దందా

కేవలం ఫీజుల రూపంలోనే కాకుండా దరఖాస్తు ఫారాల విషయంలోనూ అక్రమాలకు తెరలేపారు. బయట మీసేవ కేంద్రాల నుండి తెచ్చుకున్న దరఖాస్తులను ఇవి పని చేయవంటూ తిప్పి పంపుతున్నారు. తమ వద్దే దరఖాస్తు తీసుకోవాలని బలవంతం చేస్తూ ఒక్కో ఫారానికి 10 రూపాయలు వసూలు చేస్తున్నారు. సెంటర్ నిర్వహణలో కనీస సమయపాలన లేదని, ఎప్పుడు వెళ్లినా తాళాలు వేసి ఉంటోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నా జిల్లా స్థాయి అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ సెంటర్ నిర్వాహకులు ఆకృత్యాలకు పాల్పడుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

## విచారణ జరపాలని డిమాండ్

జన్నారం ఆధార్ సెంటర్‌పై వెంటనే విచారణ జరిపి అధిక డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సామాన్యులకు ఇబ్బంది కలగకుండా పారదర్శకంగా సేవలు అందేలా చూడాలని కోరుతున్నారు. జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలని, ఈ దోపిడీని అరికట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జన్నారం మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నరసింహులు జన్మదిన వేడుకలు

**వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడికి శుభాకాంక్షల వెల్లువ**

**అభిమానుల మధ్య కేక్ కట్ చేసిన ఇప్పపల్లిద..సేవలను కొనియాడిన సమాజ సభ్యులు**

**సంగారెడ్డి, మే 11 (జనం పవర్):** వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నరసింహులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు, అభిమానులు కలిసి పుట్టినరోజు వేడుకలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పూలమాలలు వేసి నరసింహులు గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని నరసింహులు సేవలను కొనియాడారు. సమాజానికి ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొంటూ భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. సంతోషభరిత వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు సందడిగా కొనసాగి విజయవంతంగా ముగిశాయి.



